# మంగపతే తంగవేలు

**మం**గ పతీసమేతంగా తన మేనకోడలు స్నేహితురాలి పెళ్లికి హైదరాబాద్ బయల్దేరింది. వీళ్లు వైజగ్‌లో గోదావరీ ఎక్స్‌ప్రెస్ ఎక్కినప్పటినుంచి తుని వచ్చేవరకూ ఎదురుకుండా సీట్లో కూర్చున్నాయన చెప్పింది చెప్పకుండా చెప్పాడు. మంగ అవన్నీ వింటూ ఒక నిశ్చయానికి వచ్చింది. ఈయన్ని కూడా ఇంట్లో మాట్లాడనివ్వరని. మధ్యలో మంగపతి అన్నాడు. "అవునే మంగా! నేనింట్లో ఏం మాట్లాడినా, ఇక ఆపండి బాబూ! నేను విన్లేకపోతున్నానంటావు కదా! యీయన చెప్పేది అలా ఏక బిగిన వింటున్నావు! పొరుగింటి పుల్లకూర రుచంటారు యిదేగా!"

"ఇంట్లో మీరు చెప్పేదీ, మధ్యలో ఎప్పుడో అనుకోకుండా రైల్లో తారసపడి, మళ్లీమళ్లీ కలుస్తాడో లేదో తెలియని సహ ప్రయాణికుడు చెప్పేదీ ఒకటేనా! పైగా భార్య గురించి ఆయన చెప్పిన శ్లోకం "కార్యేషు దాసీ, కరణేషు మంత్రి, రూపేచ లక్ష్మీ.....' అన్నది ఎంతో బాగుందండి. మన పెళ్ళై రెండు సంవత్సరాలయింది ఎప్పుడైనా యిటువంటి మంచి విషయాలు చెప్పారాండీ! అస్తమానూ ఆ జగదాంబా సెంటర్, శర్మాపంజాబీ పుల్కాలూ తప్ప!" అంది మంగ.

"ఏమంటున్నాడమ్మా మీ ఆయన! ఇంతకీ నీ పేరు మీ ఆయన పేరూ చెప్పనేలేదు" అన్నాడాయన.

"నా పేరు మంగ, యీయన పేరు మంగపతి" అంది మంగ.

"మీ పెళ్ళైన తర్వాత అబ్బాయి తన పేరు మంగపతిగా మార్చుకున్నాడా?"

"లేదండీ, పెళ్లికి ముందు కూడా ఆయన పేరు మంగపతి?" అంది మంగ.

"బాగుందమ్మా, చాలా సంతోషం, మీ పరిచయమవడం. వైజాగ్ వచ్చిన తర్వాత వీలుచూసుకుని మా ఇంటికి రండి" అంటూ తన విజిటింగ్ కార్డ్ ఇచ్చాడాయన.

హైదరాబాద్ ఒక గంట లేటుగా చేరింది రైలు. తమని రిసీవ్ చేసుకోవడానికి ఎవరైనా వచ్చారేమోనని చూసిన మంగ ఎవ్వరూ రాకపోయేసరికి నిరుత్సాహపడింది.

మంగపతి మొదలెట్టాడు. "నేనీ పెళ్లికిరానంటే బలవంతంగా లాక్కొచ్చావు. చిన్నప్పటినుంచి నీ మేనకోడలితోబాటు అత్తయ్యా అత్తయ్యా అంటూ, చాలా

ఆప్యాయంగా వుండేవారన్నావ్. ఈ పెళ్లికి వస్తే వాళ్లు చేసే మర్యాదలు తెలుస్తాయన్నావ్. కనీసం స్టేషన్‌కి కూడా ఎవ్వరూ రాలేదు. ఇప్పుడేంచేస్తాం! ఆ ఫంక్షన్‌హాల్లో వుండడానికి సరైన వసతి వుందో, లేదో తెలియదు. ఏ లాడ్జిలోనైనా దిగుదాం''.

మంగపతి మంట చల్లారడానికి లాడ్జిలో ఒక గది తీసుకోమంది మంగ.

అక్కడ్నించి ఫంక్షన్ హాల్‌కి ఫోన్ చేసింది మంగ. పెళ్లికూతురు చెల్లెలు తెగబాధపడిపోయింది. 'అత్తయ్యా! లాడ్జిలో దిగడమేమిటీ! అన్నయ్య స్టేషన్‌కి వచ్చాడు! మరి మిమ్మల్ని ఎలా మిస్సయ్యాడో తెలీటం లేదు. మగపెళ్లి వారి తరపున ఒక పెద్ద ఆఫీసర్ వచ్చాడు. తెగ ఫోజ్ కొడుతున్నాడు. మేమనుకున్నాం! అసలు మన అత్తయ్య తన ఎటెండర్‌తో సహా వస్తేనేగాని వీడి రోగం కుదరదని! నేను వెంటనే ఆ లాడ్జికి వచ్చి మిమ్మల్ని తీసుకొస్తాను''

''అక్కర్లేదు లాడ్జి ఖాళీ చేసి నే వచ్చేస్తాన్లే, ఒక గంటలో అక్కడ వుంటాను. మన వాళ్లకి చెప్పు నేను వచ్చేస్తానని'' అంది మంగ.

దిగాలుగా మారింది మంగ మొహం. పతి అడిగాడు ''ఏమైనా బాధాకరమైన విషయమా!''

''ఏంలేదు! నేను పెద్ద ఆఫీసర్ని కదా! అందుకని నాతోపాటు ఒక ఎటెండర్ కూడా వస్తాడనుకుంటున్నారు, వాళ్లు. పైగా మగ పెళ్లి వారి తరపున ఎవరో పెద్ద ఆఫీసరు వచ్చాడట తెగఫోజుకొడుతున్నాడట'' అంది మంగ.

''ఆ! ఈ మండిపోతున్న ధరల కాలంలో, ఎటెండర్‌ని ఎక్కడ 'తీసుకొస్తాం!?''

''ఇప్పుడు వాళ్లని నిరుత్సాహపరచడం నాకిష్టంలేదండి! నాకొక ఐడియా వచ్చింది! మీకు సెలవు దొరక్కపోవడం వలన, పెళ్లికి రాలేదని చెబుతాను!''

''అంటే నన్ను వైజాగ్ వెళ్లిపొమ్మంటావా?''

''హారి బడుద్ధాయి?'' అని లోపలనుకుని, మీరొక్క సహాయం చెయ్యండంటూ రెండు తెల్లపంచెలు తెచ్చాంకదా, అవి అడ్డపంచెలుగా కట్టుకోండి!''

''అక్కడకెళ్లిన తర్వాత కట్టుకుంటాను. ఇప్పట్నుంచీ కట్టుకుంటే మాసిపోతాయి?'' అన్నాడు పతి.

"హరి నా వెర్రిపతీ?" అని స్వగతంగా అనుకుని, యిక సరిగా చెప్పకపోతే కాలాతీతమవుతుందని, ఆర్నెల్లో భార్య గురించి ఆయన చెప్పిన శ్లోకం జ్ఞాపకం చేసుకోండి, భార్యకి ఎన్ని లక్షణాలుండాలో తెలిసింది కదా! అన్ని విధాల భార్య పనికొస్తే, భర్త ఒక్కసారి ఎటెండర్, అది కూడా రెండు రోజులు సహాయపడితే తప్పా? ఒక్క రెండురోజులు ఆ తెల్లపంచల్ని అడ్డపంచలుగా కట్టుకుని, కొంచెం నాసిరకం చొక్కాలు వేసుకుని అక్కడ నా అటెండర్‌గా నటించండి. పైగా మీరు కాలేజీలో చదువుకునే రోజుల్లో నాటకాల్లో వేషాలు వేసినట్లు చెప్పారు కదా! ఆ అనుభవం యిప్పటికి అక్కరకొస్తోంది అనుకోండి" అంది మంగ.

"తప్పదా, నేనేదో పెళ్లిలో మంగపతిగా దర్జాగా వుందామనుకున్నా. అటువంటిది నన్ను మంగసేవకుడిగా మారుస్తున్నావు".

"ఒక్క రెండురోజులే కదండీ? ఇకపై మీ పేరు తంగవేలు!" అంది మంగ.

స్నానం చేయించి అడ్డపంచి కట్టించి రెండుసార్లు "ఏమోయ్ తంగవేలూ!" అంది మంగ.

"ఏమిటే మంగా?" అన్నాడు పతి.

"అదేం వద్దు! ఈ పెళ్లయ్యే వరకూ నేనూ మీ మేడమ్‌ని. ఎప్పుడైనా సరే, నేను మిమ్మల్ని తంగవేలూ అని పిలిస్తే మీరు వినయంగా "మేడమ్ మేడమ్" అని పిలవాలి గుర్తుంచుకోండి"

లాడ్జి ఖాళీ చేసి ఫంక్షన్ హాలుకి వెళ్లారు.

అక్కడ వీళ్ళ సూట్‌కేసు, బ్యాగ్ ఎవరో లోపలికి తీసుకు వెడుతుంటే, పెద్ద గొప్పగా తన హోదాచూపిస్తూ, "అక్కర్లేదు మా తంగవేలు తీసుకొస్తాడు. ఏమిటోయ్ తంగవేలూ! అలా చూస్తూ నిలబడతావ్? ఆ లగేజ్ లోపల పెట్టు!" అంది మంగ.

"ఆమ! మేడమ్!" అన్నాడు పతి.

"ఆ అదీ వరస ఇక్కడివాళ్లకి తమిళం రాదు. గొంతు మార్చి అలాగే మాట్లాడు, పైగా, ఆ తలపాగా ఎట్టిపరిస్థితుల్లోనూ తీయకు, అది తీస్తే నిన్ను గుర్తుపట్టే ప్రమాదముంది!" అంది మెల్లగా, మంగ.

"రొంబ ఫైన్ మేడమ్!" అన్నాడు పతి.

లోపలికి వెళ్లిన తరువాత కాఫీ టిఫిన్లు తెచ్చారు. "అదేమిటే మంగా! యింత ముఖ్యమైన పెళ్లికి నీ మొగుడ్ని తీసుకురాకుండా వచ్చావు?" అంటూ బుగ్గలు నొక్కుకుంది ఒక పెద్ద ముత్తైదువ.

'ఆయనకు సెలవు దొరకలేదు' అంది మంగ.

"నేను కూడా వచ్చాను". గట్టిగా అరుద్దామనుకున్నాడు, పతి.

పెళ్లికొడుకెలా వున్నాడో చూద్దామని వెళుతున్న కొంతమంది ఆడపెళ్ళివారితో మంగకూడా బయల్దేరింది. ఇంతలో పెళ్ళి కూతురు చెల్లెలు వచ్చి, "నీ గొప్పతనం తెలియాలంటే, ముందు తంగవేలును పంపించి, "మా మేడమ్ వస్తున్నారు" అని చెప్పిద్దాం" అంది.

అక్కడ చూస్తే, తంగవేలు కనబడలేదు. మంగ విసుక్కుంది. "వీడు ఆఫీసులోనూ యింతే! ఏదైనా శిక్ష వేస్తే, ఏడుస్తాడని చూస్తున్నాను".

ఎవరో "తంగవేలు తంగవేలు" అని గట్టిగా అరిచారు! పాపం పతి అప్పుడే వస్తున్నానన్నాడు కాని, ఆ పేరు అలవాటు లేక, జవాబు చెప్పలేదు. మంగ, మంగపతి మీద గట్టిగా అరిచింది.

"ఏం! నావరుం అనలేవా!"

"అంటే ఏమిటే!" అంది ఒకావిడ.

"ఇతను అరవతను. అరవంలో నేను వస్తున్నానని అర్థం" అంది మంగ.

"అబ్బ! తమిళ్ కూడా వచ్చే నీకు!?" అంది ఆవిడ.

"ఏం చేస్తాం? పెద్ద ఉద్యోగం కదా! అన్నీ నేర్చుకోవాలి! మనదేశంలో ఎప్పుడెక్కడికి వేసినా వెళ్లి పని చేయాలి! అందుకే అన్ని బాషలు నేర్చుకున్నాను" అంది మంగ, పి.వీ.గారు లేని లోటు భర్తీచేస్తున్నట్లు!

"నా ఆయుష్షు కూడా పోసుకోవే మంగమ్మతల్లీ!" అంది ఒక ఆత్మీయురాలు.

"నువ్వు బహుభాషా కోవిదురాలన్న విషయం యిప్పుడే తెలిసిందే మంగా!"

అనుకున్నాడు పతి. అంతకుముందే ఆమె చెప్పినట్లుగా, పతి. ముందే వెళ్లి, "మా మేడమ్ వస్తున్నారు" అని ఎలుగెత్తి చాటాడు.

ఇంతలో పతితో చిన్నప్పుడు చదువుకున్న ఆర్ముగం "ఎన్నాడా పతీ! నీకు కళ్యాణమయిందా! ఎన్నాళయిందిరా, నిన్ను చూసి! ఆ విభూది ఏమిట్రా?" అని కౌగిలించుకోబోయాడు.

"ఎవరండీ పతి? ఇతను మా అత్తయ్య అటెండర్ తంగవేలు, మా అత్తయ్యగారు పెద్ద ఆఫీసర్" అంది పెళ్లి కూతురి చెల్లెలు.

"అమ! పతి యారు?" అన్నాడు పతి. అయినా యీ ఆర్ముగంగాడు యీ మగపెళ్లివారి తరపున రావడమేమిటీ, ఖర్మ గాకపోతే!" అనుకున్నాడు.

మంగ ఆ మగపెళ్లి వారి తరపున వచ్చి ఫోజ్ కొడుతున్నాయనతో మాట్లాడి తనకంటే అతనిది చిన్న ఉద్యోగమని తేల్చి, ఆడపెళ్లివారికి ఊరట కల్గించింది.

తర్వాత "తంగవేలూ యిక నడవ్వోయ్!" అంది. "ఆర్ముగం వచ్చి సారీ మేడమ్! మా క్లాస్‌మేట్ పతి ఒకతను అచ్చంగా తంగవేలు అవర్‌ఘళ్‌లా వుండేది" అన్నాడు.

"ఆ దానికేముందిలెండి! ఒకే మనిషిని పోలినవారు ప్రపంచంలో ఏడుగురుంటారు!" అంది మంగ.

మంగ ఎక్కడికెళ్లినా పతి, తంగవేలు రూపంలో ముందుండే వాడు. మధ్యాహ్నం భోజనాలయిన తర్వాత "ఎవరైనా సంగీతం పాడతారా?" అంటే, మంగ "మా తంగవేలు బాగా పాడతాడంది. పతికి శాస్త్రీయ సంగీతం బాగావచ్చు. తంగవేలు రూపంలో కీర్తనలు బాగా పాడాడు. నానాటిబతుకూ నాటకమూ అన్న అన్నమయ్య కీర్తన కూడా పాడాడు. ఆర్ముగం కూడా ఆ కీర్తనలు విని "అచ్చం మా పతిలాగే పాడాడు" అంటూ పతికి హారతులీయరే..." అంటూ, ఆ ప్రోగ్రామ్‌కి మంగళం పాడాడు.

పతికి కళ్లల్లో నీళ్లొచ్చాయి. "అరే ఆర్ముగం! నీ పతిని నేనేరా" అని గట్టిగా అరుద్దామనుకున్నాడు. కాని అలా చేస్తే వైజాగ్ వెళ్లి తర్వాత మంగ తనకు సఫారీ కుట్టించదేమోనని మానేశాడు.

పెళ్లివాళ్లు మంగ హోదానిబట్టి ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేశారు.

మంగపతి ఆవిడ పతియైనా, గది బయట చలిలో పడుకున్నాడు. అసలే కార్తీకమాసం! తెల్లారకట్ల చలి ఎక్కువై "మంగా! లోపల పడుకుంటానే! మళ్లీ ఎవరూ లేవకుండా పొద్దున్నే వచ్చేస్తా!" అని తలుపు కొట్టి చెప్పాడు.

"అయ్యొ మీ విడ్డూరం మండా! ఎవరైనా చూస్తే నా పరువే కాను! మీతో అక్రమసంబంధం వుందనుకుని నా మొహం మీద ఉమ్మేస్తారు!" అంది మంగ.

"నీ మొహం మండా! మొగుడితో అక్రమ సంబంధం అనుకోవడమేమిటే?!" అని ఏడుస్తూ ఎంకిపెళ్లి సుబ్బి చావుకొచ్చిందంటే ఇదేనేమో" అనుకున్నాడు. పెళ్లయిపోయింది! తిరుగుప్రయాణమయ్యారు, మంగా అండ్ పతి. స్టేషన్‌కి వచ్చి సాగనంపుతామంటే, "ఎందుకూ శ్రమ! మా తంగవేలున్నాడు కదా" అంది మంగ, లేకపోతే తంగవేలే తన పతి అని తెలుస్తుందన్న భయంతో.

గోదావరి ఎక్స్‌ప్రెస్ యింక బయల్దేరుతుందనగా ఆదరాబాదరాగా పెళ్లికూతురు చెల్లి వచ్చి "అత్తయ్యా నీకు పెట్టిన చీరా జాకెట్టూ, స్వీట్లూ మర్చిపొయ్యావు! అయినా అంత మతిమరుపేమిటత్తయ్యా! యీ చలికాలంలో స్వెట్టర్ వేసుకోకుండానే ప్రయాణం చేస్తావా! అదికూడా మర్చిపోయావు! ఇదిగో! అంది.

మంగ ఎదురుగా కూర్చున్న పతిని, పోల్చుకోలేక పోయిందా పిల్ల. అప్పటికే వీభూది చెరిపేసుకుని అడ్డపంచికీ, తలపాగాకూ స్వస్తీచెప్పి, ప్యాంట్ షర్ట్ వేసుకుని, అసలు మంగపతయిపోయాడు పతి.

"మీ తంగవేలు ఏడి అత్తా?" అందా పిల్ల.

"ఎటెండర్లని ఎక్కడ వుంచాలో అక్కడ వుంచాలి. అందుకనే వాడికి స్లీపర్ క్లాస్ చేయించాను. వాడందులో వస్తున్నాడంది" మంగ.

ఎదురుగా కూర్చున్న పతితో, "మా అత్తయ్య ఒక్కర్తే యీ కంపార్ట్‌మెంట్‌లో వస్తోంది! అవసరమయితే, ఏదైనా సహాయంచెయ్యండి! ఆఫ్‌కోర్స్, ఆవిడ ఎటెండర్ కూడా ఈ రైల్లోనే వస్తున్నాడనుకోండి" అంది, అభం శుభం ఎరుగని పెళ్లికూతురి చెల్లెలు.

(నవ్య, 27-7-2005)